Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 323 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
ఆదివారం, 9 - 8 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ద్రోహులనే కలుస్తారా.. విద్యార్థులను కలవరా



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. నిరసనలు చేస్తున్న యువతను కలవడానికి ప్రధానమంత్రికి సమయం ఉండటం లేదని, కానీ తమ పార్టీని వీడి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఎంపీలను కలవడానికి మాత్రం సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. ముంబైలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ ఠాక్రే ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన తమ పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలను ఇటీవల ప్రధానమంత్రి మోదీ కలవడంపై ఉద్ధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రధానమంత్రికి యువతను కలిసేందుకు సమయం లేదు. కానీ తిరుగుబాటుదారులను కలవడానికి సమయం ఉంది' అంటూ ఉద్ధవ్ విమర్శించారు. షిండే నేతృత్వంలోని శివసేనకు 'అసలైన శివసేన'గా గుర్తింపు ఇచ్చిన ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ తమ వర్గం దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న సమయంలో ఈ భేటీ ఎందుకు జరిగిందని ఉద్ధవ్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టుపై ఒత్తిడి తీసుకు రావడానికి చేసిన ప్రయత్నమే ఈ భేటీనా అని ఆయన ప్రశ్నించారు. శివసేనలో చీలిక తర్వాత ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే వర్గాల మధ్య రాజకీయ పోరు కొనసాగుతోంది. ఇటీవల ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది.

## వైసీపీవి దిగజారుడు రాజకీయాలు

- డీఎస్సీ నియామకాలను అడ్డుకోవడానికి వైసీపీ 356 పిటిషన్లు వేయించిందన్న నిమ్మల
- జగన్ అండ్ కో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మండిపాటు
- ఐదేళ్ల పాలనలో ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదో జగన్ చెప్పాలని డిమాండ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలను అడ్డుకోవడానికి గతంలో 356 పిటిషన్లు వేయించిన వైసీపీ, ఇప్పుడు నిరుద్యోగుల పేరుతో ఆందోళనలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. పాలకొల్లు నియోజకవర్గంలో రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఎస్సీపై జగన్ అండ్ కో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని, వారి కుట్రలకు ప్రభుత్వం తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు అభ్యర్థులు కష్టపడి కోచింగ్ తీసుకుని ఉద్యోగాలు సాధిస్తే, వైసీపీ మాత్రం స్వార్థ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా డీఎస్సీ వేస్తానని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పడమే కాకుండా... తన ఐదేళ్ల పాలనలో ఎందుకు ఉద్యోగాలు భర్తీ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న జగన్ వెంటనే వైసీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అన్నారు. చరిత్రలో 2 లక్షలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు.

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలోఎవరూ చేసి ఉండరు

- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్ - ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగు నీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు - గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు - ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన - డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి - పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక - ప్రతి ఎన్నికలోనూ గతంలో కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్య నిర్దేశం



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తు చేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే..గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# ఆగస్టు 23న విజయవాడలో 'సృజనోత్సవం' సాహిత్య సాంస్కృతిక సందడి

**- చిత్రకళా వీధిలో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్**



**గుంటూరు, (రాజధాని వార్తలు):** కవులు, రచయితలు, కళాకారుల్ని ప్రోత్సహించేందుకు మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆగస్టు 23న ఆదివారం విజయవాడలో జరపబోతున్న 'సృజనోత్సవం' సాహిత్య సాంస్కృతిక సందడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమ కరపత్రాన్ని శనివారం గుంటూరులో జరుగుతున్న చిత్రకళావీధిలో నిర్వాహకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వాడుక భాష పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా సాహిత్య సాంస్కృతిక వికాసం కోసం, భాషాభివృద్ధి కోసం చేసే ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రమంతా జరగాల్సి వుందన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ -భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకోసం జరపబోతున్న ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, మినీ స్కిట్స్, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, గజల్ గానం, గిడుగు సేవా పురస్కారాలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా రావాలని మంత్రి కందుల దుర్గేష్ని కోరారు. ఉదయం 10 గంటలకు 'కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ' నిర్వాహకులు ఎ. గీత, పి.మౌనిక శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. హాజరైన కవులు, కళాకారులందరికీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. శాలువా, జ్ఞాపికతో సత్కారం వుంటుందన్నారు. కవి సమ్మేళనం కోసం 83329 03156 నెంబరులో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సృజనోత్సవం పర్యవేక్షకుడు చొప్పా రాఘవేంద్రశేఖర్, డా.కత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బాలల పార్లమెంట్, కిశోర బాలికల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు, బలోపేత కార్యక్రమం





**తుళ్ళూరు, (రాజధాని వార్తలు):** తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో " బాలల పార్లమెంట్ మరియు కిశోర బాలికల హక్కుల ఆధారిత ఉద్యమం కోసం ఏర్పాటు మరియు బలోపేతం" అనే కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పెద్దిపాగ అనిల్ కుమార్ మాట్లాడుతూ బాలలు మరియు కిశోర బాలికలకు తమ హక్కులపై అవగాహన కల్పించడం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందింపచేయడం మరియు సమాజంలో వారికి ఎదురయ్యే సమస్యలను స్వయంగా వ్యక్తపరచుకునే, పరిష్కార మార్గాలు కనుగొనే ధైర్యం కల్పించడం అని బాలల హక్కులు, ఉచిత నిర్బంధ విద్య హక్కు, సంపూర్ణ ఆరోగ్య హక్కు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగినది. తరువాత అత్తోట పోతురాజు మాట్లాడుతూ పిల్లలలో చిన్న నాటి నుండే సామాజిక స్పృహ కలిగి ఉండాలని, విలువలతో కూడిన విద్యను, సోదర భావం కలిగించే విధంగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు నేర్పించాలి అని బాలల పార్లమెంట్ నిర్మాణం గురించి, అందులో సభ్యుల బాధ్యతలు విధులు గురించి, కిశోరబాలికలో లింగ సమానత్వం, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్యం మరియు భద్రత వంటి విషయాల గురించి అలానే గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వాటిపై సంబంధిత అధికారులకు తెలియజేసే విధంగా పిల్లలకు చైతన్యం కల్పిస్తున్నాం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, బాలల పార్లమెంట్ సభ్యులు, కిశోర బాలికలు, అంగన్వాడీ టీచర్ భాగ్యమ్మ, ఆశా వర్కర్లు, వి.సి.పి.సి కమిటీ సభ్యులు మరియు ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ మీడియా అక్రిడిటేషన్ సిస్టమ్‌ను ప్రారంభించిన ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎస్పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ మీడియా అక్రిడిటేషన్ సిస్టమ్ను ప్రవేశపెట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల, ఐపిఎస్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు వాస్తవమైన, వేగవంతమైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా కీలక భాగస్వామి అని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల సూచనల మేరకు డీడీ ఐడపీఆర్, పోలీసు పిఆర్ఓ టీమ్, ఎస్ఏఏఎస్ టెక్ టీమ్ సహకారంతో ఈ వినూత్న వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ విధానంలో అక్రిడిటెడ్ జర్నలిస్టుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ డిజిటల్ పాస్ జారీ చేయబడుతుందని, పోలీసు అధికారులు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా క్షణాల్లో సంబంధిత మీడియా ప్రతినిధి వివరాలను ధృవీకరించవచ్చని వివరించారు. జర్నలిస్టుల వివరాలు సురక్షిత డిజిటల్ డేటాబేస్‌లో భద్రపరచబడతాయని, దీనివల్ల నకిలీ మీడియా పాస్‌ల వినియోగాన్ని అరికట్టడంతో పాటు వ్యవస్థలో పారదర్శకత మరింత పెరుగుతుందని చెప్పారు. VVIP/ VIP పర్యటనలు, బందోబస్తు, నేర సంఘటనలు, అత్యవసర పరిస్థితుల్లో మీడియా ప్రతినిధుల వివరాలను త్వరితగతిన ధృవీకరించేందుకు ప్రత్యేక మీడియా పోర్టల్ ద్వారా అధికారులకు రియల్‌టైమ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ వ్యవస్థ జర్నలిస్టులకు వారి విధి నిర్వహణను మరింత సులభతరం చేయడమే ప్రధాన ఉద్దేశమని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసు–మీడియా మధ్య పరస్పర విశ్వాసం, పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం, వృత్తిపరమైన సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీని కొంత మంది మీడియా మిత్రులు ఈ క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌ను 3వ రోజూ కూడా ఎక్స్టెటెండ్ చేయగలరు అని అభ్యర్థించగా, సోమవారం కూడా ఈ ప్రోగ్రామ్ ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించాలి అని అధికారులకు సూచనలు ఇచ్చారు.

# స్మాల్ డైలీ, పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ : గుంటూరు జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ కందుల దుర్గేష్



**గుంటూరు, (రాజధాని వార్తలు):** ఏపిడబ్ల్యూజెఎఫ్ అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ మీడియం స్మాల్ డైలీ & పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్. లోగోను గుంటూరు జిల్లా ఇన్చార్జి మినిస్టర్ కందుల దుర్గేష్ శనివారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో చిన్న పత్రికలుకు సంబం దించిన లోగోను ఆవిష్కరించారు. వార్త సేకరణ విషయంలో ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ముందుండి సమాచారాన్ని ప్రజలకు అందించేది చిన్న పత్రికలని ఆయన అభినందించారు. సమాచారం అందించడంలో ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా మంచి సమాచారాన్ని ప్రజలకు అందిస్తామని స్మాల్ డైలీ పిరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ బృందం తెలిపారు. అనంతరం గుంటూరు జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ కందుల దుర్గేష్ పాత్రికేయ బృందాన్ని అభినందించి,అభివృద్ధి పథంలో ముందుకు నడవాలని ఆయన స్వాగతం పలికారు.

# స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంపై సమీక్ష





**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతి నగరానికి ముఖద్వారంగా నిర్మాణం రూపుదిద్దుకుంటున్న ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు గురువారం క్షేత్రస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయపూడిలోని బ్లాక్ -4 అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) కార్యాలయములో సంస్థ ఛైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి, గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ సి.ఎం.సాయికాంత్‌వర్మ, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, ఏడీసీ అధికారులు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం - పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. స్టీల్ బ్రిడ్జికి సమీపంలో డబ్ల్యూఆర్డీ గోడౌన్ వద్ద సుమారు 1500 మంది ప్రజలతో సభా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి గల ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా బకింగ్‌హాం కెనాల్, గుంటూరు ఛానెల్, కొండవీటి వాగులలో గుర్రపుడెక్క తొలగించి వాటి పరీవాహక ప్రాంతాలలో 21 రకాల అందమైన మొక్కలను ఏర్పాటు చేయాని నిర్ణయించారు. స్టీల్ బ్రిడ్జి పరిసర ప్రాంతాలలో రహదార్ల శుభ్రత, బకింగ్‌హాం కెనాల్, గుంటూరు ఛానెల్, కొండవీటి వాగుల వద్ద తగి విధంగా ఏర్పాట్లు చేయాలని ఏడీసీ ఛీఫ్ ఇంజినీరు టి.మోజెస్‌కుమార్‌ను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడీసీ ఛీఫ్ ఇంజినీర్లు బి.నరసింహమూర్తి, సీహెచ్.ధనుంజయ, జనరల్ మేనేజర్ కె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి






అల్లవరం, **(రాజధాని వార్తలు):** ప్రతి ఒక్కరూ సైనికునిలా పనిచేసే బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఎస్ ఐ ఆర్ కన్వీనర్ సంసాని రత్నకుమార్ అన్నారు. అల్లవరంలో మండల అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి అధ్యక్షతన మండల ఇంచార్జ్ మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం బిజెపి నాయకుల సమావేశం నిర్వహిం చారు.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ ఆర్ అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ సంసాని రత్నకు మార్ పాల్గొన్నారు. స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)గడువు ఈనెల 30తో ముగియనున్న సం దర్భంగా ప్రతి గ్రామంలో ఓటర్ లిస్టును సరి చూసుకొని ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపు బాధ్యతను ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతగా నిర్వహిం చాలని రత్న కుమార్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించే విధంగా కృషి చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర సాయి,గుడాల పుల్లయ్య శెట్టి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మొల్లేటి రామ్ కుమార్, కట్టా జనార్దన్ రావు, కంకిపాటి సాయిరాం, బండిగుప్తాపు శ్రీని వాస్, ఆకుల రామారావు, బండి గుస్తాబు, సుబ్బరాజు, మేకల చంటి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విఎస్‌యూ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక ఇంటర్వ్యూలు సోమవారానికి వాయిదా

**- అధ్యాపకేతర పోస్టుల వాక్-ఇన్ ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా**



సత్యం జ్ఞానమనంతమ్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం (వీఎస్‌యూ) ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించాల్సిన అధ్యాపకేతర వాక్-ఇన్ ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేయడం జరిగినది అని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కె. సునీత ఒక ప్రకటనలో తెలిపారు.

అదేవిధంగా, ఆగస్టు 8 (శనివారం) నిర్వహించాల్సిన అధ్యాపక వాక్-ఇన్ ఇంటర్వ్యూలను అనివార్య కారణాల వలన ఆగస్టు 10 (సోమవారం) ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు సవరించిన తేదీ, సమయానికి అవసరమైన ఒరిజినల్ ధ్రువ పత్రాలు, వాటి ప్రతులు మరియు ఇతర సంబంధిత పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని రిజిస్ట్రార్ సూచించారు.

# విజ్ఞాన్ యూనివర్సిటీల లా కళాశాలలో "క్రాఫ్టింగ్ ది లీగల్ మైండ్"పై ప్రముఖ న్యాయవాది నర్రా శ్రీనివాస్ గెస్ట్ లెక్చర్

**గుంటూరు, (రాజధాని వార్తలు):** విజ్ఞాన్ యూనివర్సిటీలకు చెందిన లా కళాశాలలో "క్రాఫ్టింగ్ ది లీగల్ మైండ్: ది ఆర్ట్, ఎథిక్స్ అండ్ డ్యూటీ ఆఫ్ లా" అంశంపై ప్రముఖ న్యాయవాది నర్రా శ్రీనివాస్ గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. న్యాయ విద్యార్థులకు న్యాయ వృత్తి బాధ్యతలు, చట్టాలను అధ్యయనం చేసే విధానం, వృత్తి నైతికత, క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమాజం పట్ల న్యాయవాదుల బాధ్యత వంటి అంశాలపై ఆయన విస్తృతంగా అవగాహన కల్పించారు. న్యాయవృత్తిలో ఉన్నవారు కేవలం చట్టాలపై మాత్రమే కాకుండా వైద్యం, ఇంజినీరింగ్, సైకాలజీ, చరిత్ర, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సామాజిక అంశాలు తదితర అనేక రంగాలపై అవగాహన కలిగి ఉండాలని నర్రా శ్రీనివాస్ అన్నారు. మానవ జీవితంలోని వివిధ అంశాలతో న్యాయపరమైన వివాదాలు ముడిపడి ఉంటాయని, అందువల్ల న్యాయవాది సమాజాన్ని విస్తృత దృక్పథంతో అర్థం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. 1998లో జరిగిన ఆల్ ఇండియా మూట్ కోర్ట్ పోటీల్లో పాల్గొన్న సందర్భాన్ని గుర్తు చేసుకున్న ఆయన, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి. చంద్రచూడ్ చెప్పిన విషయాలను ప్రస్తావించారు. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశంపై న్యాయవాదికి కొంతైనా అవగాహన ఉండాలని, న్యాయవాది ఒకే అంశానికి పరిమితం కాకూడదని ఆయన సూచించినట్లు తెలిపారు. ముఖ్యంగా కుటుంబ వివాదాలను పరిష్కరించే సమయంలో మానవ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని నర్రా శ్రీనివాస్ చెప్పారు. కుటుంబ కేసులు కేవలం చట్టపరమైన అంశాలే కాకుండా భావోద్వేగాలు, సంబంధాలు, అపార్థాలతో ముడిపడి ఉంటాయని, అందువల్ల న్యాయవాది క్లయింట్ మనస్తత్వాన్ని అర్థం చేసుకుని సరైన సలహా ఇవ్వాలని సూచించారు.

**ప్రతిరోజూ చట్టాలను, తీర్పులను చదవాలి**

లా విద్యార్థులు ప్రతిరోజూ 2 నుంచి 3 గంటలు చట్టాలను చదవడంతో పాటు వార్తాపత్రికలు, తాజా కోర్టు తీర్పులను అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. అధ్యాపకులు తరగతిలో ఒక అంశాన్ని బోధించే ముందు విద్యార్థులు స్వయంగా ఆ అంశాన్ని చదివి రావాలని చెప్పారు.

ప్రతి విద్యార్థి కనీసం రోజుకు ఒక తీర్పును చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. తీర్పు రెండు, మూడు పేజీలదైనా సరే చదివి, అందులోని ముఖ్యాంశాలను నోట్స్‌గా రాసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా సుప్రీంకోర్టు, హైకోర్టుల తాజా తీర్పులపై దృష్టి పెట్టాలని సూచించారు.

**ఏఐ, గూగుల్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

న్యాయ విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యత పెరిగిందని నర్రా శ్రీనివాస్ అన్నారు. గతంలో న్యాయవాదులు ఒక తీర్పును అధ్యయనం చేయడానికి అనేక పుస్తకాలు, లా జర్నల్స్ పరిశీలించాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గూగుల్,



ఆన్‌లైన్ లీగల్ డేటాబేస్‌లు, కోర్టు వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అయితే ఏఐ ఇచ్చే సమాచారాన్ని యథాతథంగా నమ్మకుండా, దానిని విశ్లేషించి, ధృవీకరించి, న్యాయపరంగా అన్వయించుకునే సామర్థ్యాన్ని విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. సరైన ప్రశ్న అడగడం నేర్చుకోవడం కూడా ఎంతో ముఖ్యమని చెప్పారు.

**డిజిటల్ మీడియా వినియోగంలో న్యాయవాదులు క్రమశిక్షణ పాటించాలి**

న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు డిజిటల్ మీడియాను ఉపయోగించే సమయంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను పాటించాలని ఆయన సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారం కంటే సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని పంచుకోవడం మంచిదని చెప్పారు. న్యాయ వృత్తిలోకి అడుగుపెట్టే విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే వృత్తిపరమైన క్రమశిక్షణ, గౌరవం, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు.

**లా చదివిన వారికి అనేక అవకాశాలు**

న్యాయవాదిగా మారడం అంటే కేవలం కోర్టులో ప్రాక్టీస్ చేయడమే కాదని నర్రా శ్రీనివాస్ చెప్పారు. కార్పొరేట్ లా, లీగల్ అడ్వైజరీ, లీగల్ కన్సల్టెన్సీ, జ్యుడీషియల్ సర్వీసెస్, ప్రభుత్వ న్యాయ విభాగాలు, న్యాయ సహాయ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు తదితర అనేక రంగాల్లో అవకాశాలు ఉన్నాయని వివరించారు. టెక్నాలజీ రంగం వేగంగా మారుతున్నప్పటికీ, మానవ సంబంధాలు, హక్కులు, బాధ్యతలు, సామాజిక సమస్యలు ఉన్నంతకాలం న్యాయ వృత్తికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. అయితే చట్టాల్లో వచ్చే మార్పులు, కొత్త చట్టాలపై న్యాయవాదులు నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**చట్టాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలి**

ఏదైనా చట్టాన్ని చదివేటప్పుడు కేవలం సెక్షన్లను బట్టీ పట్టడం కాకుండా ఆ చట్టం ఉద్దేశం, స్వరూపం, అధ్యాయాలు, సెక్షన్లు, నిర్వచనాలు, హక్కులు, నేరాలు, శిక్షలు, పరిహార మార్గాలు వంటి అంశాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలని సూచించారు. ఇండియన్ పెనల్ కోడ్ నుంచి భారతీయ న్యాయ సంహితకు వచ్చిన



మార్పులను ఉదాహరణగా పేర్కొంటూ, పాత చట్టాలపై ఉన్న అవగాహనతో పాటు కొత్త చట్టాలను కూడా లోతుగా అధ్యయనం చేయాలని చెప్పారు.

**జ్యుడీషియల్ సర్వీసెస్‌కు మొదటి సంవత్సరం నుంచే సిద్ధం కావాలి**

జ్యుడీషియల్ సర్వీసెస్‌లోకి వెళ్లాలనుకునే విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని నర్రా శ్రీనివాస్ సూచించారు. పరీక్షల సిలబస్‌ను ముందుగా తెలుసుకుని, మొదటి సంవత్సరం నుంచే అవసరమైన అంశాలను చదవడం ప్రారంభిస్తే ఐదేళ్ల కోర్సు పూర్తయ్యే సమయానికి మంచి పరిజ్ఞానం సాధించవచ్చని చెప్పారు.

**శ్రేయా సింఘాల్ కేసు స్ఫూర్తిదాయకం**

లా విద్యార్థులు కూడా రాజ్యాంగపరమైన మార్పులకు కారణమయ్యే స్థాయిలో పనిచేయగలరని చెప్పేందుకు శ్రేయా సింఘాల్ కేసును ఉదాహరణగా ప్రస్తావించారు. యువ న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు చట్టాలను ప్రశ్నించే ధైర్యం, రాజ్యాంగపరమైన హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా కేశవానంద భారతి కేసు వంటి చారిత్రాత్మక తీర్పులను ప్రతి న్యాయ విద్యార్థి అధ్యయనం చేయాలని చెప్పారు. భారత రాజ్యాంగ న్యాయ చరిత్రను అర్థం చేసుకోవడానికి ఇలాంటి తీర్పులు ఎంతో ముఖ్యమని వివరించారు.

**ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి**

న్యాయ విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టు ఎంతో అవసరమని నర్రా శ్రీనివాస్ చెప్పారు. ఇంగ్లీష్ బాగా రాకపోయినా అది న్యాయవృత్తిలో ఎదగడానికి అడ్డంకి కాదని, వార్తాపత్రికలు చదవడం, కొత్త పదాలను నేర్చుకోవడం, రోజువారీ పదజాలాన్ని పెంచుకోవడం, భాషా అభ్యాసానికి ఏఐ, యాప్‌లను ఉపయోగించడం ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ప్రతిరోజూ 5 నుంచి 10 కొత్త పదాలను నేర్చుకుని వాటిని ఉపయోగించే అలవాటు చేసుకోవాలని చెప్పారు.

**క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అవసరం**

మంచి న్యాయవాదిగా ఎదగడానికి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ఎంతో అవసరమని నర్రా శ్రీనివాస్ అన్నారు. ఉదయాన్నే నిద్రలేచి వార్తాపత్రికలు చదవడం, చదువుకు సమయం కేటాయించడం, శారీరక వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు పెంచుకోవాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటేనే క్లయింట్లతో, న్యాయమూర్తులతో సమర్థంగా వ్యవహరించగలరని చెప్పారు. ప్రయాణ సమయంలో కూడా లీగల్ న్యూస్, న్యాయపరమైన వీడియోలు, విద్యాపరమైన ఆడియోలను వినడం ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ప్రజా ప్రయోజనాల కోసం న్యాయవాదులు పనిచేయాలి**

ప్రజలకు ఉపయోగపడే అంశాలపై న్యాయవాదులు దృష్టి పెట్టాలని నర్రా శ్రీనివాస్ అన్నారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, సామాజిక సమస్యలు, ప్రజలకు న్యాయం అందించే అంశాల్లో న్యాయవాదులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. తన దాదాపు మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్న ఆయన, వేలాది కేసుల్లో వాదనలు వినిపించానని తెలిపారు. తన వద్ద పనిచేసిన పలువురు జూనియర్లు న్యాయమూర్తులుగా ఎంపికయ్యారని, జ్యుడీషియల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు గతంలో మార్గదర్శకత్వం అందించానని చెప్పారు.

**ప్రముఖ న్యాయవాదుల జీవితాలను అధ్యయనం చేయాలి**

విద్యార్థులు ప్రముఖ న్యాయవాదుల జీవితాలను, వారి వాదనా పద్ధతులను అధ్యయనం చేయాలని సూచించారు. రామ్ జెఠ్మలానీ, కపిల్ సిబల్, దుష్యంత్ దవే, నాని పాల్కివాలా, అభిషేక్ మను సింఘ్వి, హరీష్ సాల్వే, జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు తదితర ప్రముఖుల వృత్తి ప్రయాణం నుంచి స్ఫూర్తి పొందాలని చెప్పారు. న్యాయవాదికి కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం, విషయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నైతిక విలువలు, సానుభూతి, నిరంతరం నేర్చుకునే తత్వం అత్యవసరమని వివరించారు.

**"సమాజానికి, అవసరమైన వారికి న్యాయం అందించడమే లక్ష్యం"**

న్యాయవృత్తి కేవలం కేసులు గెలవడం కోసం మాత్రమే కాదని, సమాజంలో న్యాయాన్ని బలోపేతం చేయడం కూడా న్యాయవాదుల బాధ్యత అని నర్రా శ్రీనివాస్ అన్నారు. "సమాజానికి న్యాయం.. అవసరమైన వారికి న్యాయం" అనే లక్ష్యంతో న్యాయవాదులు పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూ, వృత్తిపరమైన క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తులో మంచి న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయ నిపుణులుగా ఎదగగలరని ఆకాంక్షించారు. న్యాయ విద్యార్థులు తమ ఐదేళ్ల విద్యా కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని చదువు, క్రమశిక్షణ, నైతికత, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక బాధ్యత అనే ఐదు అంశాలను తమ వృత్తి జీవితానికి పునాదులుగా చేసుకోవాలని ఆయన సూచించారు.

# కల్వర్టు పనులకు జలీల్ అహ్మద్ జోరు



**కోట, (రాజధాని వార్తలు):** కోట మండల నడిబొడ్డున ఎన్సీఆర్ నగర్ ఎదురుగా ప్రధాన రహదారిపై చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. టీడీపీ నాయకుడు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో పనులు వేగం పుంజుకోవడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ మార్గంలో కల్వర్టు నిర్మాణాన్ని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.హామీ ఇచ్చిన మాట ఆచరణలోకి..ఎన్సీఆర్ నగర్ కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేసిన సమయంలో రోజుల వ్యవధిలోనే పనులు పూర్తి చేసి కోట ప్రజలకు కల్వర్టును అంకితం చేస్తామని షేక్ జలీల్ అహ్మద్ పేర్కొన్నారు. ఆ మాటను నిలబెట్టుకునే దిశగా నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే పనులు ఈ స్థాయిలో ముందుకు సాగుతుండటంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేగంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం:ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న ఈ కల్వర్టు విషయంలో పనుల వేగం మాత్రమే కాకుండా నిర్మాణ నాణ్యతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో వర్షాకా లంలో నీటి ప్రవాహం కారణంగా ఏర్పడే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించేలా నిర్మాణాన్ని పటిష్టంగా చేపడుతున్నారు. కల్వర్టు నిర్మాణం పూర్తయిన తర్వాత ఎన్సీఆర్ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నిర్మాణ సంస్థకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ పనుల పురోగతిని షేక్ జలీల్ అహ్మద్ పర్యవేక్షిస్తున్నారు. కోట అభివృద్ధిలో మరో అడుగు:ఎన్సీఆర్ నగర్ కల్వర్టు నిర్మాణం పూర్తయి తే కోట మండల కేంద్రంలోని రాకపోకలకు మరింత సౌలభ్యం కలగనుంది.వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగడంతో పాటు రహదారి భద్రత కూడా మెరుగుపడుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేవలం పనులకు శ్రీకారం చుట్టడమే కాకుండా ఇచ్చిన హామీని నిర్ణీత సమయంలో ఆచరణలో పెట్టేందుకు వేగంగా అడుగులు వేస్తుండటం అభివృద్ధి పనులపై స్థానికుల్లో నమ్మకాన్ని పెంచుతోందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం మాత్రమే తమ లక్ష్యం కాదని, నిర్ణీత వ్యవధిలో నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎన్సీఆర్ నగర్ కల్వర్టును త్వరితగతిన పూర్తి చేసి కోట ప్రజలకు అంకితం చేసేలా పనులను వేగవంతం చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కల్వర్టు నిర్మాణంపై స్థానికుల హర్షం:కల్వర్టు పనులు ప్రారంభించిన వెంటనే వేగంగా కొనసాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి,ప్రధాన సమస్యకు పరిష్కారం చూపే దిశగా పనులు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కల్వర్టు పూర్తయిన తర్వాత కోట మండల కేంద్రంలో రాకపోకలకు మరింత ఊతం లభించడంతో పాటు ఎన్సీఆర్ నగర్ అభివృద్ధికి ఇది కీలక మౌలిక వసతిగా నిలుస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్మాణ పనులలో ఎంపీటీసీలు షేక్ శంషుద్దీన్, దారా సురేష్ వెంకన్నపాళెం సర్పంచ్ కోకోలు మధు యాదవ్, షేక్ నౌషాద్ తదితరులు ఉన్నారు.

# 47వ డివిజన్‌లో పూర్తయిన స్ట్రీట్ లైట్ల మరమ్మతులు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గౌరవ మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సహకారంతో నెల్లూరు నగరంలోని 47వ డివిజన్‌లో స్ట్రీట్ లైట్ల సమస్యకు పరిష్కారం లభించింది. డివిజన్ పరిధిలోని గుప్తా పార్క్, అగ్నిపేట, సవరాల వీధి, ఉయ్యాల కాలవ, కుక్కల కుంట, మురళీకృష్ణ మందిరం, మరియు కామాటి వీధి ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 47వ డివిజన్ కార్పొ రేటర్ పోట్లూరి రామకృష్ణ దృష్టికి తీసుకు వచ్చారు. స్థానికుల అభ్యర్థనపై వెంటనే స్పందించిన కార్పొరేటర్ మున్సిపల్ అధికారు లతో మాట్లాడి తక్షణమే ఆయా ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్ల మరమ్మ తులు పూర్తి చేయించారు. చీకటి సమస్యను వెంటనే పరిష్కరించిన మంత్రికి, కార్పొరేటర్‌కి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రెటరీ చెన్నూరు గిరిధర్, దీూజ రామిశెట్టి గిరిబాబు, జహూర్ అహ్మద్, మేద శీను, పిల్ల ప్రసాద్, మరియు ఐటీడీపీ ఆర్ మెషిన్ సెక్రటరీ మహంకాళి సురేంద్ర పాల్గొన్నారు.

# ఘనంగా 12వ జాతీయ చేనేత దినోత్సవం







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన భవన్‌లో నిర్వహించిన 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య తదితరులు హాజరయ్యారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నేతన్న సేవలో పథకం ద్వారా 4,793 మంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున బాపట్లలో నిర్వహించిన కార్యక్రమం ద్వారా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ చేశారు. చేనేత కార్మికులను ఘనంగా సత్కరిం చిన ఎమ్మెల్సీ ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్

# యువత అభివృద్ధికి రాపిడో సర్వీస్‌లు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** యువత ఆర్థికంగా అభివృధి చెందాలనే లక్ష్యంలో భాగంగా ప్రైవేటు "రాపిడో సర్వీసు"ను ఏర్పాటు చేయడం జరిగిందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపాన సామర్ల కోట, పెద్దాపురంకి సంబంధించి "రాపిడో" పాయింట్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ప్రజలు ప్రయాణాలు సాగించేందుకు రాపిడో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా రాపిడో వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, కూటమి నాయకులు బదుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, సరోజ వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, మదగల శ్యామ్, రాపిడో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గాంధీ గర్వించే 'దేశద్రోహులు'!

'ఏ దేశ పౌరులలోనైనా మహోన్నతులు ఎవరు? ప్రజాహితాన్ని పట్టించుకోని పాలకులను ప్రశ్నించేవారు, అధికారానికి ఎట్టి పరిస్థితులలోను మోకరిల్లనివారు, దేశ స్వాతంత్ర్యాన్ని, జాతి గౌరవాన్ని కాపాడేందుకు, అవసరమైతే ప్రభుత్వాన్ని సైతం ఎదిరించేందుకు వెనుకాడనివారే నిక్కమైన దేశభక్తులు, గొప్ప పౌరులు' - ఇవి, ఫ్రెంచ్ రచయిత ఆల్బర్ట్ కామూ ఉద్ఘాటించిన సత్యాలు. ఇరవయో శతాబ్ది బ్రిటిష్ చరిత్రకారులలో అగ్రగణ్యుడైన ఏజేపీ టేలర్ ఆధునిక జర్మనీ, ఆధునిక బ్రిటన్, ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలు, లార్డ్ బీవర్ బ్రూక్ మీడియా సామ్రాజ్యంపై పలు పుస్తకాలు రాశారు. అయితే అన్నిటిలోకి తనకు బాగా ఇష్టమైన పుస్తకం 'ఏఫ్త్రవ ఎతీశీబఎశ్రీవ మీఘనవతీం' అని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. గ్రేట్ బ్రిటన్ విస్తరణవాద, సామ్రాజ్యవాద విదేశాంగ విధానాలను వ్యతిరేకించిన బ్రిటిష్ రాజనీతిజ్ఞుల గురించిన అధ్యయనాలే ఆ విశిష్ట గ్రంథం. 19వ శతాబ్ది ఉదారవాద రాజకీయవేత్త జాన్ బ్రైట్ ఆ రాజనీతిజ్ఞులలో ఒకరు. బ్రైట్ మహాశయుడు ఒక సార్వకాలిక మహావక్త. కామన్స్ సభలో పార్లమెంటరీ సంస్కరణలు, విదేశాలలో బ్రిటిష్ సైనిక జోక్యాలకు వ్యతిరేకంగా ఆయన ప్రసంగాలు ప్రజలను ప్రభావితం చేశాయి, పాలకులకు దడ పుట్టించాయి. ప్రభుత్వ విధానాలపై ఆయన విమర్శలు టోరీలను కోపావేశులను చేశాయి. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా బ్రైట్ వదరుతున్నాడని వారు ఆరోపించారు. ఆ అభియోగంపై ఆ ఉదారవాద రాజనీతిజ్ఞుడు తీక్షణంగా ప్రతిస్పందించాడు: 'నేను మీ కంటే ఎక్కువగా ఆంగ్లేతరుడిని, దేశ వ్యతిరేకిని ఎలా కాగలను? నేను ఈ గడ్డపై పుట్టలేదా? నేను కూడా మీరు వచ్చిన ఇంగ్లీష్ వంశం నుంచే రాలేదా? నా కుటుంబం ఈ దేశ భద్రత, శ్రేయస్సుకు కట్టుబడలేదా? నాకు ఉన్న సిరి సంపదలు ఏవైనా మీ ఆస్తిపాస్తుల మాదిరిగానే మన మాతృభూమి సుపరిపాలనపైనే ఆధారపడి ఉన్నాయి కదా. మరి ఈ దేశ వ్యవహారాలకు సంబంధించిన ఒక అంశంపై తోటి దేశస్థుడు ఒకరు భిన్నాభిప్రాయాన్ని కలిగి ఉన్నాడనే కారణంతో అతడిని దేశ ద్రోహి, జాతి వ్యతిరేకి అని మీరు ఎలా అంటారు?' నేను ఈ మాటలను మూడు దశాబ్దాల క్రితం మొట్టమొదటిసారి చదివినప్పుడు నా మనసులో నాటుకుపోయాయి. ముఖ్యంగా 'దేశ ద్రోహి' లేదా 'దేశ వ్యతిరేకి' (యాంటీ-నేషనల్) అనే నిందాపూర్వకమైన తిట్టు నా యవ్వనకాల భారతదేశంలో సర్వత్రా వినిపిస్తుండేది. సాక్షాత్తూ మన ప్రధానమంత్రే స్వయంగా ఆ దూషణ పదాన్ని ఉపయోగించారు. 1971లో భారీ మెజారిటీతో అధికారాన్ని గెలుచుకున్న ఇందిరాగాంధీ క్రమంగా నిరంకుశ పాలకురాలిగా పరిణమించారు. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోయారు. రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలు అన్నిటినీ తన అధికారానికి దాసోహం చేసుకున్నారు. భారత జాతీయ కాంగ్రెస్‌ను తన కుటుంబ సంస్థానంగా మార్చివేశారు. ఇందిర పాలనా విధానాలను స్వాతంత్ర్య సమరయోధుడు, నిష్కళంక ప్రజానాయకుడు జయప్రకాశ్ నారాయణ్ ప్రశ్నించారు. ఆయనతో సహా ప్రతిపక్ష నాయకులు చాలామందికి విదేశీ నిధులు అందుతున్నాయని ఇందిర ఆరోపించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తన విమర్శకులను దేశ వ్యతిరేకులు అని నిందించారు. మోదీ సర్కార్ విధానాలను వ్యతిరేకించే వారికి ప్రత్యర్థి దేశమైన పాకిస్థాన్ నుంచి ఆర్థిక లబ్ధి సమకూరుతుందని లేదా అమెరికా వ్యాపార దిగ్గజం జార్జి సోరోస్ తరఫున వ్యవహరిస్తున్నారని ప్రధానమంత్రి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. మోదీ ప్రభుత్వ నిరంకుశ పాలనను, మెజారిటేరియన్ విధానాలను వ్యతిరేకించేవారిని 'తుక్డే తుక్డే గ్యాంగ్'గా అభివర్ణిస్తున్నారు. ఈ సువిశాల భారతదేశాన్ని మరోసారి ముక్కలు చెక్కలు చేసేందుకు విదేశీ ప్రభుత్వాల తరఫున వ్యవహరిస్తున్నారని కూడా విమర్శిస్తున్నారు. 'అర్బన్ నక్సల్స్', 'మెకాలే పుత్రులు' సహా మరెన్నో నిందాపూర్వక మాటలతో దూషిస్తున్నారు. ఈ దూషణలు, ఆరోపణలు అన్నీ నిరాధారమైన అనుమానాలే. ఒక స్పష్టమైన మానసిక రుగ్మతకు అవి తార్కాణాలు. ప్రశ్న పత్రాల లీక్‌లతో సహా ప్రభుత్వ విద్యావ్యవస్థలోని అవినీతికి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అశేష విద్యార్థుల నిరసనలపై సంఘ్ పరివార్ విమర్శలు ఆ అనుమానాస్పద ఆలోచనా విధానానికి తాజా నిదర్శనాలు. భారతీయులను రెండు వర్గాలుగా విభజించడం సంఘ్ పరివార్‌కు చెందిన అతి జాతీయవాదులకు పరిపాటి. మొదటి వర్గం దేశభక్తులు. వీరు జాతిశ్రేయస్సుకు అంకితమయినవారు. రెండో వర్గం దేశద్రోహులు. వీరు విశ్వాసఘాతకులు. మాతృభూమి ఉన్నతికి వ్యతిరేకులు. మోదీ ప్రభుత్వ మద్దతుదారులు మొదటివర్గం కిందకు వస్తారు. ప్రభుత్వ విధానాలతో విభేదించేవారు రెండో వర్గం కిందకు వస్తారు. అప్పుడప్పుడూ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారు సైతం దేశద్రోహుల కిందే లెక్క. విద్యార్థుల నిరసనల సందర్భంలో 'దేశద్రోహి' అనే నిందాపూర్వక మాటలోని ద్వేషపూరిత కపటత్వం సుస్పష్టంగా కనిపిస్తున్నది. నేహా దీక్షిత్ ఇటీవల 'హిమల్'లో రాసిన ఒక వ్యాసంలో, ఆ నిరసనల్లో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ విద్యార్థిని ఒకరు చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు: 'నాకు ఊహ వచ్చినప్పటి నుంచీ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారంతా 'దేశద్రోహులే' అన్న తిరస్కారపూరిత మాట వింటున్నాను. అయితే జాతీయ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీక్‌లు, వాటికి కారణమైన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చేందుకు దేశాన్ని పరిపాలిస్తున్న పార్టీ చేసిన ప్రయత్నాలు అవగతమైన తరువాత నేను ఒక సత్యాన్ని గ్రహించాను-లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు దేశద్రోహులు కారని, భారత ప్రభుత్వమే దేశద్రోహానికి పాల్పడుతోందని'. నిండు సత్యం ఉన్న నిశిత వ్యాఖ్య ఇది, సందేహం లేదు.

## స్పాన్సర్‌షిప్ లబ్ధిదారులతో ముఖాముఖి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ జి ఉష అధ్యక్షతన మిషన్ వాత్సల్య పథకం కింద స్పాన్సర్‌షిప్ లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్.వెంకట్రావు హాజరై మాట్లాడారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథలు, పాక్షిక అనాథలు, హెచ్ఐవీ ప్రభావితులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కుటుంబాలు, కోవిడ్ ప్రభావిత కుటుంబాలకు చెందిన 18 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రభుత్వం స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న 67 కుటుంబాల లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, పిల్లల విద్య, ఆరోగ్యం, వైద్య అవసరాలు, వారి ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పిల్లల విద్య, వైద్యం, పోషణ మరియు సమగ్ర అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. అనంతరం సీడీపీఓ ఉష మాట్లాడుతూ పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలోని 67 కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రతి నెల రూ.4,000 చొప్పున ఆర్థిక సహాయం పొందుతున్నట్లు తెలిపారు. పిల్లల సంరక్షకులు వారిని సొంత పిల్లలుగా భావించి వారి విద్య, ఆరోగ్యం, పోషణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారులు కె శ్రీనివాస్, జాగరపు విజయ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న స్పాన్సర్‌షిప్ పథకం వల్ల కలుగుతున్న ప్రయోజనాలపై లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులు స్పందిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పిల్లల విద్య, అత్యవసర వైద్య అవసరాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని, ఈ పథకం తమ కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తోందని తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ విజయ్ మాట్లాడుతూ, మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని పిల్లల విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ మరియు సమగ్ర సంక్షేమానికి ఎంతో దోహదపడుతోందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న పిల్లలందరూ ఉన్నత విద్యను అభ్యసించి, మంచి పౌరులుగా, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు వెంకట రమణమ్మ, సుల్తాన్ బీబీ, ఉమా, చంద్రకళ, మంగ తదితరులు, స్పాన్సర్‌షిప్ లబ్ధిదారులు, సంరక్షకులు పాల్గొన్నారు.

## సొసైటీకి ఉత్తమ అవార్డుపై డీసీసీబీ చైర్మన్ అభినందన

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** నవర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)కు ఉత్తమ సొసైటీ అవార్డు లభించడం సహకార రంగానికి దక్కిన గొప్ప గుర్తింపని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని సహకార సంఘాలు అందిస్తున్న సేవలకు ఈ అవార్డు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నవర పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సీఈఓ, గ్రామ సభ్యులు తుమ్మల రామస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్తమ సొసైటీ అవార్డు సాధనలో సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు, సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్లు కలిసి నవర పీఏసీఎస్‌కు లభించిన ఉత్తమ సొసైటీ అవార్డును తుమ్మల రామస్వామి బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి మాట్లాడుతూ, సహకార రంగ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడం, తక్కువ వడ్డీతో రుణాలు, వ్యవసాయ అవసరాలకు సకాలంలో ఆర్థిక సహాయం, ఎరువులు, విత్తనాలు వంటి సేవలను సమర్థవంతంగా అందించడంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను



బలోపేతం చేయడంలో సహకార సంఘాల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలంలోని నవర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఉత్తమ సొసైటీగా ఎంపిక కావడం ఆ సంఘం పాలకవర్గం, అధికారులు, సిబ్బంది, సభ్యులు, రైతుల సమిష్టి కృషికి నిదర్శనమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో కూడా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆదర్శ సహకార సంఘంగా నవర పీఏసీఎస్ నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఇంచార్జ్ డీజీమ్ ఏలిశెట్టి రమేష్, నవర పీఏసీఎస్ చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్లు నాగనబోయినా చంటి, గున్నబత్తుల చల్లారవు, తోట నాగభూషణం, గ్రామ సభ్యులు, రైతులు, డీసీసీబీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కరపలో 'ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనల'కు విశేష స్పందన

**- 95 అర్జీలు స్వీకరణ.. జెడ్.భావారం నుంచే 40 వినతులు : ఆర్డీవో ఎస్.మల్లిబాబు**





**కరప, (రాజధాని వార్తలు):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు' కార్యక్రమానికి కరప మండల కేంద్రంలో విశేష స్పందన లభించింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని చంద్రన్న సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రియా ఆధ్వర్యంలో, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పర్యవేక్షణలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ హాజరుకావాల్సి ఉండగా, మంత్రుల పర్యటనతో పాటు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడంతో ఆయన రాలేకపోయారని అధికారులు తెలిపారు. దీంతో ట్రైనీ కలెక్టర్ ప్రియా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 95 అర్జీలు స్వీకరించగా, వాటిలో సుమారు 40 అర్జీలు జెడ్. భావారం గ్రామానికి చెందినవేనని ఆర్డీవో మల్లిబాబు తెలి పారు. డ్రైనేజీల నిర్మాణం, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మూసుకుపోయిన పంట కాలువల పునరుద్ధరణ, విద్యుత్ సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల సమస్యలపై అత్యధికంగా వినతులు అందినట్లు చెప్పారు. అలాగే ఒక రేషన్ డీలర్‌పై ఫిర్యాదు, గ్యాస్ ఏజెన్సీ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం అనంతరం ఆర్డీవో మల్లిబాబు మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అందించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించే చర్యలు చేపడతామని తెలిపారు. నాలుగో సందర్శన నాటికి ఎక్కువ శాతం సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే వారం ఇదే వేదికపై మరో సమావేశం నిర్వహించనున్నామని, ఆ సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిడివో వి.వాసుదేవరావు, తహసిల్దార్ ఆకుల సరస్వతి, డిప్యూటీ తాసిల్దార్ డి దుర్గాప్రసాద్, ఎంపీడీవో జటావల్లభల శ్రీనివాస్, రిపీట్ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు, కర్రీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి సిబ్బంది పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## మరిడమ్మ అమ్మవారికి చల్లావారి వీధి "చీర - సారె"



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం గ్రామదేవత శ్రీ మరిడమ్మ అమ్మవారికి పెద్దాపురం చల్లావారి వీధి ప్రజలు శుక్రవారం రాత్రి "చీర - సారె" సమర్పించారు. చల్లావారి వీధి నుంచి ఊరేగింపుగా భారీ సారెతో విచ్చేసి ఆలయంలో అమ్మ వారికి సమర్పించారు. ఆలయ అధికారి భక్తులు తీసుకువచ్చిన చీర - సారెను అందుకుని అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో చల్లావారి వీధి భక్తులు, ఆలయ పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిడ్డకు తల్లిపాలే ఔషధం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఔషదంగా పనిచేస్తాయని అంగన్వాడి సూపర్వైజర్ ఎండి సుల్తాన్ బీబీ, ఉమాదేవిలు అన్నారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పెద్దాపురం ప్రాజెక్టు అధికారిని జి ఉష సూచనలతో సూపర్వైజర్ ఎండీ సుల్తాన్ బీబి సామర్లకోట మునిసి పాలిటీ పరిధిలోని కోటబజారు 1, 2 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమము శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలని, ఇతర ద్రవ పదార్థాలు ఏమీ పట్టరాదని, ఆరు నెలలు పూర్తి అయ్యేవరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని తెలిపారు. ఏఎన్ఎం సత్యవేణి మాట్లాడుతూ తల్లిపాలు ఏ విధముగా ఇవ్వాలో తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా తల్లిపాల వలన ప్రయోజనాలు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జాగారపు విజయ, జి ఎం ఎస్ కె హిమజ, ఎ ఎన్ ఎం సి హెచ్ భావానీ అంగన్వాడి కార్యకర్తలు వి వెంకటలక్ష్మి, ఎ వాణిదేవి, ఆశా వర్కర్‌లు, అంగన్వాడీ హెల్పర్లు తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## మరిడమ్మ తల్లికి భక్తుల భారీ "బోనం" సమర్పణ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా అత్యంత వైభవంగా పెద్దాపురం మహారాణి సత్రం వీధికి చెందిన మహిళలు, వార్డు ప్రజలు మరిడమ్మ అమ్మవారికి బోనం సమర్పించారు. అన్న సత్రం వీధి నుండి శోభాయాత్రగా మరిడమ్మ అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు చేరుకుని వారు తీసుకువచ్చిన బోనం సమర్పించారు. బోనం శోభ యాత్రకు ఆలయ కార్యనిర్వాహనాదికారిణి కె విజయలక్ష్మి ఘనంగా ఆలయం వద్ద స్వాగతం పలికారు. అనంతరం భక్తుల బోనం స్వీకరించి భక్తులకు ప్రత్యేక పండిత ఆశీర్వచనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, సిబ్బంది, పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## అనుమతి లేని విగ్రహాలను తక్షణం తొలగించాలి : వీ.సీ. కే పార్టీ డిమాండ్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో రోడ్డు మధ్య, రోడ్డుకి ఇరువైపులా ఉన్న విగ్రహాలను తొలగించాలని వీసీకే పార్టీ డిమాండ్ చేసింది. పట్టణంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి, కుడిపూడి చిట్టబ్బాయి విగ్రహాలు తొలగించాలని వీ.సీ.కే పార్టీ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బొంతు రమణ హైకోర్ట్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన గౌరవ హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. దీనిపై జిల్లా కలెక్టర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు.అమలాపురం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే హై స్కూల్ సెంటర్‌లో ట్రాఫిక్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన దొమ్మేటి వెంకటరెడ్డి, కుడిపూడి చిట్టబ్బాయి విగ్రహాలు తొలగించాలని 2024 లో అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు రమణ స్పందనలో ఫిర్యాదు చేశారు.ఆ విగ్రహాల ఏర్పాటుకు ఎటువంటి అను మతి తాను ఇవ్వలేదని కలెక్టర్ శుక్ల స్పష్టం చేశారు. అయినా తొలగించకపోవడంతో ప్రజా ప్రయోజనార్థం హైకోర్టుని ఆశ్రయించడం జరిగిందని రమణ తెలిపారు.ట్రాఫిక్ ఇబ్బందులు కలగజేస్తున్న ఈ రెండు విగ్రహాలను తక్షణం తొలగించాలని శుక్రవారం రమణ డిమాండ్ చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# నయన్ బ్రాండ్‌కు అసలైన పరీక్ష!






స్టార్ హీరోల మధ్య బాక్సాఫీస్ పోటీలు సాధారణమే. కానీ ఒకే స్టార్ హీరోయిన్ నటించిన రెండు సినిమాలు దాదాపు ఒకే టైమ్‌లో థియేటర్లలోకి రావడం మాత్రం అరుదుగా జరిగే విషయం. అలాంటి పరిస్థితిని ఇప్పుడు నయనతార ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం రిలీజ్ డేట్‌ల యాదృచ్ఛికం మాత్రమే కాదు.. ఆమె బ్రాండ్ పవర్, నటిగా ఉన్న వెర్సటిలిటీ, ఆడియన్స్‌లో ఆమెకున్న పర్సనల్ మార్కెట్‌పై ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు కారణమవుతోంది. నయనతార హీరోయిన్‌గా నటించిన హాయ్ సినిమా, యష్ హీరోగా ఆమె కీలక పాత్రలో నటించిన టాక్సిక్ సినిమాలు రోజుల వ్యవధిలో రిలీజవడం, ఈ రెండు సినిమాల్లో నయనతార కనిపించే పాత్రల స్వభావం పూర్తిగా భిన్నంగా ఉండటం విశేషం. ఒక సినిమాలో ఆమె కథను ముందుకు నడిపించే మెయిన్ హీరోయిన్‌గా కనిపించనుండగా, మరో సినిమాలో భారీ కాస్టింగ్ మధ్య కీలక పాత్రను పోషిస్తున్నారు. ఒకవైపు రొమాంటిక్ కామెడీ వాతావరణం, మరోవైపు యాక్షన్ ఓరియెంటెడ్ భారీ ప్రాజెక్ట్.. ఈ రెండు జానర్ల మధ్య ఆమె యాక్టింగ్ పరంగా ఆడియన్స్‌కు ఇచ్చే ఎక్స్‌పీరియెన్స్ వారికి కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను ఇవ్వొచ్చు. గత కొన్నేళ్లుగా నయనతార కేవలం కమర్షియల్ హీరోయిన్‌గానే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్లు, ఉమెన్ సెంట్రిక్ సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను విస్తరించుకున్నారు. ఇప్పుడు ఒకే వారంలో రెండు సినిమాల్లో రెండు భిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావడం, ఆ ఇమేజ్‌కు మరో పరీక్షగా మారింది. ఒకే హీరోయిన్ రెండు వేర్వేరు ఎమోషనల్ వరల్డ్స్‌లో ఒకే టైమ్‌లో ఆడియన్స్‌ను మెప్పించగలరా అనే ప్రశ్న ఆసక్తికరంగా మారింది. ఈ రిలీజుల నేపథ్యంలో మరో అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. యాక్షన్ సినిమా ఆడియన్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆడియన్స్ ఎప్పుడూ ఒకే కేటగిరీలో ఉండరు. అందువల్ల ఈ రెండు సినిమాలు పరస్పరం ఒకదాన్ని ఒకటి పూర్తిగా ప్రభావితం చేస్తాయా లేదా వేర్వేరు ఆడియన్స్ సెగ్మెంట్లను ఆకర్షిస్తాయా అన్నది బాక్సాఫీస్ పరంగా కీలక అంశంగా మారింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, ఉమెన్ ఆడియన్స్ రెస్పాన్స్ ఈ పరిస్థితిలో నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది. ఇక నయనతార కెరీర్‌ను పరిశీలిస్తే, ఒకే వారంలో ఇంత విభిన్న స్థాయిలో రెండు సినిమాలు రిలీజవడం చాలా అరుదైన పరిణామంగా చెప్పవచ్చు. సాధారణంగా స్టార్ హీరోయిన్ల సినిమాలు రిలీజుల

# కొరియన్ కనకరాజు ఓపెనింగ్స్ అదుర్స్.. డే వన్ కలెక్షన్స్ ఎంతంటే?



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. థియేటర్లలోకి వచ్చి రావడంతోనే బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతోంది. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ తెలుగు హారర్ కామెడీ చిత్రం మొదటి రోజే సాలిడ్ వసూళ్లను సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇది ఒక మంచి ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలిచింది. పలు బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాలు, మీడియా నివేదికల ప్రకారం, ఈ సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 8 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి బాక్సాఫీస్ వద్ద ఘనమైన బోణీ కొట్టింది. రాయలసీమ ప్రాంతీయ సంస్కృతికి ఒక కొరియన్ దెయ్యం ఆవహించే వినూత్నమైన సూపర్ నేచురల్ కాన్సెప్ట్‌ను జోడించి దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్రాన్ని చాలా ఆసక్తికరంగా రూపొందించారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, నటుడు సత్య అత్యంత కీలకమైన పాత్రలో కనిపించారు. సత్య తన అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను థియేటర్లలో నవ్వుల్లో ముంచెత్తారు. సరికొత్త స్టోరీ లైన్ కావడంతో మొదటి రోజే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. భారతదేశ వ్యాప్తంగా ఈ చిత్రం మొత్తం 1,656 షోలతో చాలా గ్రాండ్‌గా విడుదలైంది. తొలిరోజే మన దేశంలో ఈ సినిమా రూ. 3.95 కోట్ల నెట్ వసూళ్లను నమోదు చేసింది. ఇక భారతదేశం మొత్తం మీద ఈ చిత్రం గ్రాస్ కలెక్షన్స్ రూ. 4.50 కోట్లకు చేరుకున్నాయి. ఇక శుక్రవారం రోజున ఈ తెలుగు 2డి వెర్షన్‌కి థియేటర్లలో మొత్తంగా 41 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. ముఖ్యంగా ఈ సినిమా నైట్ షోలకు ప్రేక్షకులు భారీగా తరలిరావడంతో అత్యధికంగా 57.42 శాతం ఆక్యుపెన్సీ నమోదై బాక్సాఫీస్ వద్ద బలమైన పట్టును చూపించింది. పైగా వరుణ్ తేజ్ కెరియర్‌లోనే తొలి రోజు అత్యధిక గ్రాస్ కలెక్షన్ వసూలు చేసిన చిత్రంగా కొరియన్ కనకరాజు నిలిచింది. ఈ సినిమా వసూళ్లలో రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రధాన పాత్ర పోషించాయి. ఇక రెండు రాష్ట్రాల నుంచి కలిపి మొదటి రోజే రూ. 4 కోట్ల భారీ గ్రాస్ రాబట్టింది. ఆ తర్వాతి స్థానంలో కర్ణాటక రాష్ట్రం నిలిచి రూ. 43 లక్షల వసూళ్లను అందించగా, తమిళనాడు నుంచి రూ. 5 లక్షలు లభించాయి. ఇక దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి మరో రూ. 2 లక్షల రాబడి వచ్చింది. చాలా కాలంగా సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న వరుణ్ తేజ్‌కు ఈ ఫస్ట్ డే వసూళ్లు పెద్ద ఊరట నిచ్చాయి. కేవలం దేశీయ మార్కెట్లోనే కాకుండా ఓవర్సీస్ లోనూ ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అదిరిపోయే స్పందన లభించింది. ప్రీమియర్లు మరియు విదేశీ మార్కెట్ల నుంచి తొలిరోజే రూ. 8 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. మరికొన్ని ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం ఇండియా గ్రాస్ రూ. 4.5 కోట్లు మరియు ఓవర్సీస్ రూ. 2 కోట్లతో కలిపి మొదటి రోజు ముగిసేసరికి ప్రపంచ వ్యాప్తంగా రూ. 6.5 కోట్ల నుండి రూ. 8 కోట్ల మధ్య మొత్తం గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. ఆడియెన్స్ టాక్ మరియు క్లైమాక్స్ రెస్పాన్స్: ఈ సినిమాలోని కాన్సెప్ట్ మరియు ఎంటర్‌టైన్మెంట్ ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించాయి. వరుణ్ తేజ్ తన నటనతో అలరించగా, సీజీఐ గ్రాఫిక్స్ విభాగాలు మరియు క్లైమాక్స్ సన్నివేశాల విషయంలో కొందరి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇక అయినప్పటికీ, థియేటర్లలో కామెడీ బాగా వర్కవుట్ కావడంతో మొత్తంమీద బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా చాలా డీసెంట్ ఓపెనింగ్స్‌తో విజయవంతంగా దూసుకు పోతోంది. మొత్తానికి 'కొరియన్ కనకరాజు' సినిమా మొదటి రోజు వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద సాలిడ్ ఓపెనింగ్ రాబట్టి శుభారంభం చేసింది. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్ల రికార్డులను సృష్టిస్తుందో వేచి చూడాలి.

# లార్జర్ దాన్ లైఫ్ కాన్సెప్ట్‌లతో బన్నీ మాస్టర్ ప్లాన్!



పుష్ప చిత్రంతో పాన్-ఇండియా సరిహద్దులను చెరిపేసి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాల విషయంలో సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రొటీన్ కమర్షియల్ ఫార్ములా జోలికి వెళ్లకుండా ..గ్లోబల్ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా లార్జర్ దాన్ లైఫ్ కాన్సెప్ట్‌లను ఎంచుకుంటున్నారు. ఇమేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా బన్నీ ప్రణాళికలు టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. భారీ లైనప్‌లో భాగంగా బన్నీ మాస్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రాకా చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. టైమ్ ట్రావెల్ వంటి సరికొత్త కాన్సెప్ట్‌ను జోడించి తెరకె క్కిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రాజెక్ట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తుందనే అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ సినిమా అనంతరం కోలీవుడ్ ట్రెండింగ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో అడ్వెంచరస్ థ్రిల్లర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. లోకేష్ తనదైన శైలిలో నడిపించే డార్క్ అండ్ రా యాక్షన్ జోనర్‌కు, బన్నీ మాస్ ఇమేజ్ తోడైతే స్క్రీన్ మీద ఎలాంటి విజువల్ వండర్ ఉంటుందోనని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా కథాంశం పూర్తిగా కొత్త ప్రపంచంలో సాగే సాహసాలతో కూడుకుని ఉండబోతున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు మలయాళ టాలెంటెడ్ డైరెక్టర్ బాసిల్ జోసెఫ్ దర్శకత్వంలో విజువల్ వండర్ సూపర్ హీరో కాన్సెప్ట్ చిత్రాన్ని కూడా అర్జున్ లైన్‌లో పెడుతున్నారు. ఇండియన్ సినిమా పరిశ్రమలో సూపర్ హీరో జానర్‌కు ఇప్పటివరకు ఉన్న పరిమితులను దాటి అత్యున్నత సాంకేతిక విలువలతో సినిమాను రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విభిన్నమైన జోనర్లను టచ్ చేస్తూనే కమర్షియల్ హంగులతో కూడిన కథలను ఎంచుకోవడంలో బన్నీ ఎప్పుడూ ముందుంటారనేది ఈ లైనప్‌తో మరోసారి క్లారిటీ దొరుకుతుంది. ఒకే రకమైన మాస్ కథలతోనే సినిమాలు చేయకుండా ప్రతీ ప్రాజెక్ట్‌కు కొత్తదనాన్ని తీసుకు రావాలనే అర్జున్ తపన అతని ప్రణాళికల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పాన్-ఇండియా మార్కెట్ పరిధులను దాటి గ్లోబల్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసేలా భారీ చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. దర్శకుల ఎంపికలోనూ విభిన్న శైలులు కలిగిన మేకర్స్‌ను నమ్ముతున్నారు. తన ప్రతి సినిమాను ఒక విజువల్ గ్రాండ్‌గా మలచాలనేది బన్నీ మాస్టర్ ప్లాన్‌గా కనిపిస్తోంది మొత్తానికి బన్నీ ఇమేజ్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లేలా జరుగుతోన్న ప్రయోగాత్మక ప్రయత్నాలు ఇండియన్ సినిమా రూపురేఖలను మార్చే అవకాశం లేకపోలేదు. రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ వద్ద ఐకాన్ స్టార్ సృష్టించబోయే సునామీ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# 'పెద్ది' సినిమాలో జాన్వీ రోల్‌పై విమర్శలు.. అదితి బాలన్ ఊహించని రియాక్షన్!





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరియు దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ 'అచీయమ్మ' అనే ప్రత్యేకమైన పాత్రలో నటించింది. అయితే, ఈ సినిమాలో ఆమె పాత్రను చూపించిన తీరుపై ప్రేక్షకులు, క్రిటిక్స్ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. తాజాగా తమిళ నటి అదితి బాలన్ కూడా జాన్వీ కపూర్ పాత్ర చిత్రణపై బహిరంగంగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'అరువి' సినిమాతో గుర్తింపు పొందిన తమిళ నటి అదితి బాలన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కథలో ఆమె 'అచీయమ్మ' పాత్రకు అసలు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని, ఆ రోల్‌ను మరింత అర్థవంతంగా, సముచితంగా రాసి ఉండాల్సిందని చెప్పారు. ఇక సినిమాలోని కీలక సన్నివేశాల్లో హీరోయిన్‌ను భాగస్వామ్యం చేసి ఉంటే బాగుండేదని అదితి బాలన్ అభిప్రాయపడ్డారు. ఆమె మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సినిమాలో జాన్వీ కపూర్ వంటి మంచి ప్రతిభ ఉన్న నటికి నటించే అవకాశం ఇవ్వకుండా, కేవలం గ్లామర్‌కే పరిమితం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెను కథలో ముఖ్యమైన భాగంలా కాకుండా కేవలం రొమాంటిక్ ప్రాప్‌లా చూపించారని ఆడియన్స్, సినీ విశ్లేషకులు మండిపడుతున్నారు. ఇక మహిళా పాత్రను కథా నడక కోసం కాకుండా కేవలం ఆకర్షణ కోసం మాత్రమే దర్శకుడు ఉపయోగించుకున్నారని, ఆమె గ్లామర్‌ను మాత్రమే చూపించడం బాధాకరమని కొందరు సినీ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సినిమాలోని కొన్ని నిర్దిష్ట సన్నివేశాల్లో కెమెరా ఫోకస్ ఎక్కువగా జాన్వీ కపూర్ నడుము, శరీర ఆకృతులపైనే ఉంచడం పట్ల మహిళా ప్రేక్షకులు మరియు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక కొన్ని సీన్స్ మరియు కెమెరా యాంగిల్స్ మహిళలను తప్పుగా చూపేలా ఉన్నాయంటూ సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇక గ్లామర్ ప్రదర్శన పేరుతో హద్దులు దాటారంటూ నెటిజన్లు దర్శకుడు బుచ్చిబాబు సానాను మరియు చిత్ర బృందాన్ని సోషల్ మీడియాలో తీవ్రంగా విమర్శించారు. సోషల్ మీడియాలో ఈ వివాదం ముదిరి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవ్వడంతో దర్శకుడు బుచ్చిబాబు సానా అప్పుడు వెంటనే స్పందించారు. ఇక ప్రేక్షకుల భావోద్వేగాలను, అభిప్రాయాలను గౌరవిస్తూ ఆయన బహిరంగంగా క్షమాపణలు తెలియజేశారు. అంతేకాకుండా, నెటిజన్లు మరియు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేసిన వివాదాస్పదమైన కొన్ని సన్నివేశాలను, కెమెరా షాట్లను సినిమా నుండి వెంటనే తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించి వివాదానికి ముగింపు పలికే ప్రయత్నం చేశారు. పెద్ద హీరోల సినిమాల్లో కథానాయికల పాత్రలు కేవలం పాటలకు, గ్లామర్‌కే పరిమితం కాకుండా వారికి కథలో మంచి ప్రాధాన్యం ఉండేలా డిజైన్ చేయాలని ఈ వివాదం స్పష్టం చేస్తోంది. చిత్ర యూనిట్ తమ తప్పును తెలుసుకుని వివాదాస్పద సీన్లను తొలగించడం మంచి పరిణామమే అయినప్పటికీ, రాబోయే రోజుల్లో దర్శకులు మహిళా పాత్రల రూపకల్పనలో మరింత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**- స్వచ్ఛతకు మారుపేరు బ్రహ్మకుమారిస్ సంస్థ సేవలు - ప్రపంచంలోనే అత్యధికంగా యువత కలిగిన దేశం భారత్ - మోడీ, చంద్రబాబుల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం గజపతినగరంలోని బ్రహ్మకుమారిస్ ఆశ్రమ ప్రాంగణంలో నషాముక్త్ కార్యక్రమాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నషాముక్త్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 4వ తేదీన వర్చువల్‌గా ప్రారంభించినట్లు తెలిపారు. బ్రహ్మకుమారీస్ మరియు కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని నషాముక్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 10 కోట్ల మందిని వ్యసనాల నుండి విముక్తి చేసేలా చేయటమే ధ్యేయంగా స్వచ్ఛతకు మారుపేరైన బ్రహ్మకుమారిస్ పనిచేస్తుందని, అందులో భాగంగా మన గజపతి నగరంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం చాలా అవసరమన్నారు. గురజాడ చెప్పినట్లు దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న నినాదాన్ని పూర్తిగా తీసుకుని పెద్దలు చెప్పే మంచి మాటలను యువత తప్పక ఆచరించాలన్నారు. ప్రపంచంలోనే అధిక శాతం యువకులు కలిగిన దేశంగా మన భారతదేశం కలిగి ఉండటం గర్వకారణమని, యువత మంచి భవిష్యత్తును పొందాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వినూత్న కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు యువత కోసం విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పిస్తుందని ఆ అవకాశాలను యువత వినియోగించుకోవాలన్నారు. మన విజయనగరం జిల్లాను డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి యువత కృషి చేయాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలతో యువత ముందుకు సాగాలని చెడు అలవాట్లకు బానిస అయిన వారిని సమాజంలో గౌరవప్రదంగా చూడరని, విద్య ద్వారా తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, విద్య ద్వారా జ్ఞానం పొందడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా నిలవ వచ్చునని, తద్వారా మంచి సమాజాన్ని కూడా నిర్మించుకోవచ్చున్నారు. ప్రభుత్వం బ్రహ్మకుమారి సంస్థ చేపడుతున్న ఈ చైతన్య యాత్రలో నేటి యువత కూడా భాగస్వాములు కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సభా కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థుల చేత నషాముక్త్ (వ్యసనాల నుండి విముక్తి) కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, రాష్ట్ర టిడిపి పొలెట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పి.వి గోపాలరాజు, స్టేట్ యూత్ కోఆర్డినేటర్ బి.కే అన్నపూర్ణ, గజపతినగరం ఇంచార్జ్ బి.కే.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు కొనసాగుతున్న జన్ - జి రిలే నిరాహార దీక్షలు

**- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య సూచనలతో, యువనేత బొత్స సాయి గురునాయుడు ఆధ్వర్యంలో రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు**









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** డీఎస్సీ - 2025 నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలపై నిరసన వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచనలతో యువ నేత బొత్స సాయి గురు నాయుడు ఆధ్వర్యంలో ఏపీ జన్ - జి కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు నియోజకవర్గ కేంద్రమైన గజపతి నగరంలో జరిగాయి. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలకు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని యువనేత బొత్స సాయి గురు నాయుడు డిమాండ్ చేశారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన గజపతి నగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద చేపట్టిన రెండవ రోజు రిలే నిరాహార దీక్షలో బొండపల్లి మండలానికి చెందిన యువజన విభాగం అధ్యక్షుడు జగదీష్, పార్టీ నాయకులు మహంతి చిన్నమ నాయుడు, మణికంఠ, రాపాక మనోహర్, చందు, తదితర నాయకులకు బొత్స సాయి గురు నాయుడు పూలదండలు వేసి దీక్షలో కూర్చుండబెట్టి వారికి మద్దతుగా నిలిచారు. డీఎస్సీ 2025లో ఎన్నో అవకతవకలు జరిగాయని వాటిపై సి.బి.ఐతో తక్షణమే దర్యాప్తు చేయించాలని బొత్స డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన 400 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు సైతం తమ అధినేత జగన్మోహన్ రెడ్డి చూపించిన ఈ ప్రభుత్వానికి చలనం లేదని బొత్స విమర్శించారు. నిరుద్యోగ యువతను పూర్తిగా ఈ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్పోర్ట్స్ కోటా కింద ఎటువంటి పరీక్ష నిర్వహించకుండా నేరుగా ఉద్యోగాలు కల్పించడం దారుణమని బొత్స అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, జడ్పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, కర్రీ లక్ష్మణ, వేమలి శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**- అమ్మ జన్మనిస్తుంది...హెల్మెట్ పునర్జన్మనిస్తుంది - రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సహకరించడం మన బాధ్యత - డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలి : వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట పుల్లయ్య**








**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి జిల్లా భద్రాచలం రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ నిబంధనల అమలు కీలకమని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య తెలియజేశారు. అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన ఐఎస్ఐ మార్కుగల హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, మైనర్లతో వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), బీమా, కాలుష్య నియంత్రణ (పీయూసీ) వంటి వాహన పత్రాలు ఎల్లప్పుడూ చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొని ట్రాఫిక్ భద్రతకు సంబంధించిన సూచనలు తెలుసుకున్నారు.

# సహాయానికి తామెప్పుడూ సిద్ధమే

**- సహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ మిత్తిరెడ్డి - అత్యవసర సమయంలో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న సహాయస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు సంతోష్**

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** సహాయం చేయడానికి తమ సంస్థ సహాయస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు ప్రతి ఒక్కరూ సిద్ధంగానే ఉంటారని ఫౌండేషన్ విశాఖపట్నం సభ్యుడు సంతోష్ మరొకసారి నిరూపించారు. సహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయికుమార్ రేవంత్ మిత్తి రెడ్డి గజపతినగరంలో విలేకరులకు అందించిన సమాచారం ప్రకారం విశాఖపట్నం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం అత్యవసరంగా బి - పాజిటివ్ రక్తం అవసరం కాగా సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ తక్షణమే స్పందించింది. ఫౌండేషన్ సభ్యుడు, విశాఖ వాసి అయిన సంతోష్ వెంటనే స్పందించి, హుటాహుటిన కేర్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సంతోష్ ఇప్పటి వరకు 41 సార్లు రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో స్పందించిన సంతోష్‌కు ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్ ఫౌండేషన్ తరపున ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ఎవరికైనా రక్తదానం చేయడానికి తమ సంస్థలోని సభ్యులు ప్రతి ఒక్కరూ ముందు వరసలో ఉంటారని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ మిత్తిరెడ్డి తెలియజేశారు.

# దశాబ్దాల కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

**- గరుడబిల్లి నుంచి నెలివాడ జంక్షన్ సిసి రోడ్డు ప్రారంభం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**






**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** నియోజక వర్గంలోని బొండపల్లి మండలం గరుడ బిల్లి ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చటం చాలా ఆనందంగా ఉం దని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించిన గరుడబిల్లి నుంచి నెలివాడ జంక్షన్ సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రహదారి లేక వేరే దారి నుండి రాకపోకలు సాగించే గరుడబిల్లి ప్రజల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెర వేరుస్తూ చిత్తశుద్ధితో రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి 50 లక్షల రూపాయలకు తక్కువ కాకుండా అభివృద్ధి చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అలాగే గ్రామస్తుల కోరిక మేరకు స్మశాన వాటిక, అంగన్వాడి కేంద్రం పనులు చేపట్టడంతో పాటు, గ్రామంలో వి బి జి రాంజీ పథకంలో పుంత రోడ్లు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2014-2019 సమయంలో సైతం నియోజకవర్గాన్ని నాటి శాసనసభ్యులు కొండపల్లి అప్పలనాయుడు అభివృద్ధి పరచడం జరిగిందన్నారు. ప్రస్తుత కారణంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కూటమి కార్యకర్తపై ఉందని మంత్రి కొండపల్లి సూచించారు. రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దశాబ్దాల కల నెరవేర్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సేవలను కొనియాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తనదైన శైలిలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతూ ముందుకు సాగుతున్న నాయకుడు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకురాలు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ, బుజ్జి రాజు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో వైద్య కళాశాల పనులు పూర్తి

## - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** త్వరలో ప్రభుత్వ వైద్య కళాశాల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన కలెక్టరేట్ వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల నాబార్డు ఫండ్స్ మురిగిపోయాయని చెప్పారు. ప్రస్తుతం సాస్కి ఫండ్స్‌తో కొత్తగా పనులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి గట్టిగా కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న సర్వజన ఆసుపత్రిని కూడా ప్రభుత్వ ఆసుపత్రిగా కొనసాగించే దిశగా ప్రతిపాదనలను ముందుకు తీసుకు వెళుతున్నామని మంత్రి వివరించారు. మంత్రితో బాటు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా ఉన్నారు.

# భారతీయ సంస్కృతికి ప్రపంచ రాయబారి రవీంద్రనాథ్ ఠాగూర్ : డాక్టర్ మండపాక నాగలక్ష్మి




**విజయనగరం, (రాజధాని వార్తలు):** విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ భారతీయ సంస్కృతికి ప్రపంచ రాయబారి అని మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఐదు ఖండాల్లోని 30కి పైగా దేశాల్లో ఠాగూర్ పర్యటించారని, సుమారు 2,230కి పైగా గీతాలను రాసి, వాటికి స్వయంగా స్వరకల్పన చేశారని ఈ పాటలన్నింటినీ కలిపి 'రవీంద్ర సంగీతం' అంటారని పేర్కొన్నారు. భారతదేశ జాతీయ గీతం "జనగణమన", బంగ్లాదేశ్ జాతీయ గీతం "అమర్ షోనార్ బంగ్లా" రెండూ రవీంద్రనాథ్ ఠాగూర్ కలం నుంచి జాలువారినవేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో కుసుమంచి సుబ్బారావు, గురజాడ వారసులు వెంకటేశ్వర ప్రసాద్ ఇందిర, ప్రముఖ రచయిత నారాయణ మూర్తి, ఎం.సుభద్ర దేవి తదితరులు పాల్గొన్నారు.

# శత్రువుల కోసం పదడుగులు ముందే ఉంటా

**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బుద్దా వెంకన్న ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణస్వీకారంతోపాటు బుద్దా వెంకన్న జన్మదిన వేడుకలను కూడా టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు, లోకేశ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు ఈ నియోజకవర్గాన్ని చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. పార్టీ కోసం నాలుగడుగులు వెనక్కి, శత్రువు కోసం పది అడుగులు ముందుంటామని తెలిపారు.

2009లో వెల్లంపల్లి శ్రీనివాస్ రాజకీయాల్లోకి వచ్చారని వెంకన్న తెలిపారు. శ్రీనివాస్ రాజకీయ నేత కాదని... పైరవీలు చేసుకునే పైరవీల నాయకుడంటూ ధ్వజమెత్తారు. 'నువ్వు రాజకీయ ఊసరవెల్లివి.. నిన్ను పుచ్చిపోయిన వంకాయలతో మీ నాయకులే కొడతారు. నువ్వు కొబ్బరి చిప్పల దొంగవి.. తెలుగుదేశం పార్టీ నాయకులు, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ మీద పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదు' అంటూ బుద్దా వెంకన్న హెచ్చరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంపీ కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, పొలిట్ బ్యూరో సభ్యులు షరీఫ్, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నాయకులు, టీడీపీ శ్రేణులు హాజరయ్యారు.

# మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని, దీనిపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా డిమాండ్ చేశారు. వైసీపీ పిలుపు మేరకు నగరిలో చేపట్టిన మూడో రోజు రిలే నిరాహార దీక్షలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ అక్రమాలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. మెరిట్ ఉన్న అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, లంచాలు దండుకుని అనర్హులకు కట్టబెట్టారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలపై మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ స్పందించి రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ దీక్షా శిబిరాలపై కోడిగుడ్లతో దాడులు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని రోజా మండిపడ్డారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ...డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించే వరకు నిరసనలు ఆపేది లేదని, తిరుపతిలో త్వరలోనే భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

# 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ఎంఎస్ఎంఈ బిల్లు పెద్దపీట వేస్తోంది



**అమరావతి, (రాజధాని వార్తలు):** పార్లమెంట్‌లో ఎంఎస్ఎంఈ సవరణ బిల్లు 2026కు ఆమోదించడంపై ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వాగతించారు. నూతన చట్టంతో ఎంఎస్ఎంఈ రంగానికి బలమైన రక్షణ, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి ఎంఎస్ఎంఈ బిల్లు ఎంతగానో ఊతమిస్తుందని తెలిపారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌కు శాశ్వత హోదాతో ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన వివాదాల పరిష్కారమవుతాయని వెల్లడించారు. కోర్టుల్లో వివాదాలు ఆరు నెలలు దాటితే అవార్డు కింద మంజూరైన మొత్తంలో 50 శాతం చెల్లింపులు తప్పనిసరి చేసిందని మంత్రి కొండపల్లి అన్నారు. మధ్యవర్తిత్వాన్ని 90 రోజుల్లోపు పూర్తి చేయడం ఎంఎస్ ఎంఈలకు చాలా ప్రయోజనమని చెప్పుకొచ్చారు. సీపీఎస్ఈలు ఇకపై TReDS ప్లాట్‌ఫారమ్ ద్వారానే ఇన్వాయిస్ సెటిల్‌మెంట్లు చేయాలని స్పష్టం చేశారు. చెల్లింపుల వివాదాల వేగవంతమైన పరిష్కారానికి రాష్ట్రంలో బహుళ ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. 'వికసిత్ భారత్ @2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర' సాధనకు నూతన విధానం దోహదం చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో లాభసాటిగా చేనేత రంగం

## - నాణ్యమైన ఉత్పత్తులతో పాటు నేతన్నలు కొత్త డిజైన్లపై దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం, (రాజధాని వార్తలు):** చేనేత రంగాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దేందుకు నేతన్నలు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు, ప్రస్తుత మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన డిజైన్లు, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ సూచించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో చేనేత నేతన్నల సంక్షేమ పురోగతిపై ఆయన మాట్లాడారు. చేనేత సహకార సంఘాలు కేవలం ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడకుండా ఓపెన్ మార్కెట్‌లోకి ప్రవేశించి మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలోని చేనేత కార్మికులకు కలెక్టర్ మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత కళ ప్రతీకగా నిలుస్తోందని, తరతరాలుగా ఈ వృత్తిని కొనసాగిస్తున్న నేతన్నల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 3,567 మంది నేతన్నలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి నెలకు గరిష్టంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. 'నేతన్న సేవలో' పథకం కింద జిల్లాలో 3,822 మంది లబ్ధి పొందుతున్నారని ప్రతి అర్హులైన నేతన్నకు సంవత్సరానికి రూ.25,000 ఆర్థిక సహాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలో డీబీటీ ద్వారా జమ చేస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన చేనేత నేతన్నలకు ప్రతి నెల రూ.4,000 పింఛన్ అందిస్తున్నామని, జిల్లాలో 3,863 మంది నేతన్నలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా అవసరమైన పనిముట్లను 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

సహకార చేనేత కార్మికుల పొదుపు పథకం, చేనేత ముద్ర పథకం ద్వారా నేతన్నలకు ఆర్థిక భద్రత, రుణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిపుణుల బృందంతో క్షేత్రస్థాయి అధ్యయనం చేశామని, ఆగస్టు నెలాఖరు లేదా సెప్టెంబర్ మధ్య నాటికి ప్రత్యేక నిపుణుల బృందం జిల్లాలోని చేనేత సహకార సంఘాలను సందర్శించనుందని అన్నారు.

**ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడొద్దు**

ప్రస్తుతం సుమారు 90 శాతం చేనేత సహకార సంఘాలు ప్రభుత్వ శాఖల ఆర్డర్లపైనే ఆధారపడు తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ పరిస్థితి నుంచి బయటపడి ప్రైవేట్, ఓపెన్ మార్కెట్‌లోకి ప్రవేశించాలని సూచించారు. దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతదేశంలో చేనేత వస్త్రాలకు ఉన్న డిమాండ్‌ను గుర్తించి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందించాలని అన్నారు.

**కొత్త డిజైన్లతో యువతను ఆకర్షించాలి**

చేనేత వస్త్రాల డిజైన్లు, రంగులు, రకాలు, నాణ్యతలో నూతనత్వం తీసుకు రావాలని కలెక్టర్ సూచించారు. వినియోగదారులను ఆకట్టుకునే ఉత్పత్తులను రూపొందిస్తే మార్కెట్ డిమాండ్‌తో పాటు నేతన్నల ఆదాయం కూడా పెరుగుతుందని అన్నారు. చేనేత రంగంలో ఆధునిక మార్పులు తీసుకు రావడం ద్వారా యువతను కూడా ఈ వృత్తి వైపు ఆకర్షించవచ్చని తెలిపారు. వచ్చే సెప్టెంబర్ నెలాఖరు నాటికి సంబంధిత శాఖల అధికారులు, కన్సల్టెంట్లు, మార్కెట్ నిపుణులతో చేనేత సహకార సంఘాల ప్రతినిధులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మార్గదర్శకత్వం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. చేనేత రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు సహకార సంఘాలు స్వయం సమృద్ధి సాధించేలా జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు, హ్యాండ్లూమ్స్ ఏడి శ్రీనివాస్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సిహెచ్ శ్రీనివాస్, చేనేత కార్మికులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చివోలులో ప్రకృతి - సేంద్రియ వ్యవసాయ అవగాహన కార్యక్రమం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ప్రకృతి వ్యవసాయంతోనే సుసంపన్న రైతు అని, సురక్షిత భవిష్యత్ సాధ్యమని నియోజకవర్గ జనసేన నాయకులు దండి నరేంద్ర అన్నారు. శుక్రవారం ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై సమగ్ర అవగాహన సదస్సును మండలంలోని ముచ్చివోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్‌నినో ప్రభావం, పిఎండిఎస్ పోస్టర్ల ఆవిష్కరించారు. అనంతరం సీడ్ బాల్స్ ప్రదర్శన, క్షేత్ర సందర్శనతో రైతులకు ప్రత్యక్ష శిక్షణ నిర్వహించారు. ముచ్చివోలు గ్రామంలో రైతులకు ప్రకృతి,సేంద్రియ వ్యవసాయంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి (డీహెచ్‌వో) భరత్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి (హెచ్‌వో) పుష్పలత, ఎస్ఆర్‌పీ ఆర్‌వైఎస్ఎస్ భాను మూర్తి, ఎంపీఈవో విజయలక్ష్మి, మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ దర్శి ప్రసాద్, గోద్రేజ్ సీనియర్ అధికారి కేశవ, సీఆర్‌పీ కార్తీక్ కుమార్, ఇంటర్న్ పుష్పలత పాల్గొని రైతులకు విలువైన మార్గదర్శకత్వం అందించారు. ఈ అవగాహన సదస్సులోని ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అనువైన పంటల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. అలాగే పామ్ ఆయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న మొక్కలు, డ్రిప్, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ వివరాలు తెలిపారు. 20 రకాల విత్తనాలతో కూడిన 10 కిలోల మల్టీ సీడ్ బ్యాగ్స్ ప్రయోజనాలు, సబ్సిడీ వివరాలు, పలువురు రైతులు వెంటనే ఆర్డర్లు ఇవ్వడం విశేషంగా నిలిచాయి. సీడ్ బాల్స్ తయారీ, వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి గ్రామస్థులతో కలిసి పొలాల్లో చల్లారు. వంకాయ, బీరకాయ పంటల క్షేత్ర సందర్శన చేసి ఆకుమచ్చ వైరస్ నివారణకు నీమాస్త్రం వినియోగంపై సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావం, (ప్రీ మాన్ సూన్ డ్రై షోయింగ్) కార్యాచరణపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరించారు. సెలవు రోజు అయినప్పటికీ ప్రత్యేకంగా విచ్చేసి రైతులను చైతన్యపరిచిన ముచ్చివోలు జెడ్పీహెచ్ఎస్ సోషల్ ఉపాధ్యాయులు చిరంజీవులుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడం ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. ఈ చైతన్యాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు, ముచ్చివోలు, ఎర్రగుడిపాడు, మంగళగిరి, ముద్దుమూడి, దొడ్లమిట్ట, వేల వేడు గ్రామాల రైతులతో త్వరలోనే మరో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలను, పర్యావరణాన్ని, రైతు ఆరోగ్యాన్ని, వినియోగదారుల భవిష్యత్తును సంరక్షించడమే తమ లక్ష్యం అని జనసేన నాయకులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రైతులకు, గ్రామ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# భీమేశ్వరాలయంలో కృష్ణంరాజు సతీమణి పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి దేవస్థానంలో మాజీ కేంద్ర మంత్రివర్యులు, సినీనటులు కృష్ణంరాజు సతీమణి శ్యామల దేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న శ్యామల దేవి ముందుగా భీమేశ్వరస్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం నంది మండపం నందు ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేయాగ, ఆలయ అధికారి బల్ల నీలకంఠం వారికి ప్రసాదములు, స్వామి వారి చిత్రపటం అందజేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, వేదపండితులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# శ్రీకాళహస్తిలో విద్యార్థులు మొదటి అడుగు

## - రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన ఏఐఎస్ఎఫ్

**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తిలో విద్యా ర్థులు మొదటి అడుగు వేశారు. వైయ్యస్సార్ సిపి చేస్తూ వున్న రిలే నిరాహార దీక్షకు ఏఐఎస్ఎఫ్ సంఘీభావం తెలిపిందని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని వారికి ఇచ్చిన డీఎస్సీ ఉద్యోగాలను వెంటనే తొలగించాలని, డీఎస్సీ నియామక అక్రమాలపై తక్షణమే సిబిఐతో విచారణ జరిపించాలని, 20 లక్షల మంది నిరుద్యోగులకు దాదాపు 2000 కోట్లు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని, ఫీజు రీయంబర్స్మెంట్ వసతి దీవెన నిధులు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వమంటే ఉన్న వారిని తొలగించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దీక్షలు చేస్తుందని అబద్ధపు ప్రచారం చేస్తున్న పచ్చ ఛానళ్లు డీఎస్సీ 2025 నియామకాల్లో జరిగిన తీవ్ర అక్రమాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏపీ జెన్ – జడ్ వార్ రిలే నిరాహార దీక్ష శుక్రవారంతో రెండవ రోజుకు చేరింది. రెండవ రోజు రిలే నిరాహార దీక్షకు ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, విద్యార్థిని విద్యార్థులు సంఘీభావం తెలిపారన్నారు. 2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మొదటి సంతకం మెగా డీఎస్సీ అంటూ 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని హడావుడి చేశారు, కానీ తీరా చూస్తే, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఆ పోస్టులను అంగట్లో సరుకుల్లా పంచిపెట్టారన్నారు. మరి ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో కనీసం పతకాలు సాధించకపోయినా, ఛాంపియన్స్ పేరుతో టీడీపీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. కనీసం ఇంటర్ కూడా పాస్ అవ్వని వారికి నకిలీ సర్టిఫికేట్లతో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు కట్టబెట్టడం అత్యంత దారుణం అన్నారు. అర్హత ఉన్నవారికి డీఎస్సీ ఉద్యోగాలు ఇవ్వాలనేదే తమ ప్రధాన డిమాండ్, అంతేగానీ ఉన్నవారిని తొలగించాలన్నది తమ ఉద్దేశం కాదన్నారు. గతంలో మన జగనన్న పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఒక్క చిన్న పొరపాటు కూడా జరగకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగాలు అందించాం. కానీ నేడు అర్హత లేని వారిని ఉపాధ్యాయులుగా కూర్చోబెడితే మన పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన ఈ కుంభకోణంపై సిబిఐ విచారణ జరిపించాలని, బాధ్యత




వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల సమయంలో చదువుకున్న నిరుద్యోగులకు నెలకు 3,000 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గత 2014లోనూ 2,000 ఇస్తామని చెప్పి, 2019 ఎన్నికల 4 నెలల ముందు తూతూ మం త్రంగా ఇచ్చి మోసం చేశారఖ ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మందికి పైగా నిరుద్యోగులకు ఉన్నారు. 20 లక్షల నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు 60 కోట్లు అలాగే సంవత్స రానికి 720 కోట్లు అలాగే ఈ రెండున్నర సంవత్సరాలకు గాను దాదాపు 2000 కోట్లు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అలాగే ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన నిధులు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ బకాయిలను వెంటనే చెల్లించాలని, జగనన్న హయాంలోనే భోగాపురం ఎయి ర్పోర్ట్ పనులు 86శాతం పూర్తయ్యాయని, మిగిలిన 14శాతం పనులు పూర్తి చేసి, మొత్తం తామే చేశామని టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో డబ్బా కొట్టుకుంటున్నారన్నారు. ప్రజలను ఎంత మభ్యపెట్టాలని చూసినా, అది జగనన్న కట్టించిన ఎయిర్పోర్ట్ అనే నిజం ప్రజలకే కాకుండా ప్రధాని మోదీకి కూడా తెలుసు. జగనన్నకు ప్రజలకు మంచి చేయడమే తెలుసు కానీ మోసం చేయడం తెలియ దని, తాము ప్రజలకు మంచి చేయడంపైనే దృష్టి పెట్టాం తప్ప ప్రచారం చేసుకోవడం తమకు రాలేదన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం ఏ మంచి చేయకపోయినా, ఏదో చేసేస్తున్నట్లు ప్రచారం చేసుకోవ డంలోనే కాలం గడుపుతోందన్నారు. వైఎస్సార్సీపీ పాలనలోని 5 ఏళ్లలో 2 ఏళ్లు కోవిడ్ వంటి క్లిష్ట సమయం ఉన్నప్పటికీ, మిగిలిన 3 ఏళ్లలో ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూర్చాం తప్ప ఎప్పుడూ మోసం చేయలేదు. కానీ నేడు రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పూర్తిగా మూలనపడింది.

# యువతను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



**తిరుపతి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం దొంగ జీవోలు తీసుకువచ్చి యువతను మోసం చేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలవేటి సంజీవయ్య ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై, అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం 2వ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజ కవర్గ అబ్జర్వర్ బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మ ణ్యం రెడ్డి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, వైసిపి నాయుడుపేట మండలం అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, వైసీపీ సూళ్లూరుపేట మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి, వైసీపి ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కటకం దీపిక, పెళ్లకూరు జడ్పిటిసి సభ్యులు నన్నం ప్రిస్కిల్లా, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి నాయుడుపేట మండల వైస్ ఎంపీపీ నెలవల మమత వైసీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు చదలవాడ కుమార్ వైసీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, వైసీపీ నియోజక వర్గ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ షబ్బీర్, వైసిపి నియోజకవర్గ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పాలేటి నాగార్జున, నాయకులు బైన మల్లికార్జున్రెడ్డి, కాలగంధ సునీల్, పేర్నాటి రాహుల్, షేక్ రహంతుల్లా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సామర్లకోటలో 20 మంది పిల్లలకు అస్వస్థత...!

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామ ర్లకోట పట్టణంలో సుమారు 20 మంది చిన్నారులు వాంతులు, జ్వరం, విరోచనాల వంటి లక్షణాలతో అస్వస్థతకు గురి కావడంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారులు కలుషిత త్రాగునీరు కారణంగా "హెపటైటిస్ ఎ" వ్యాదికి గురైనట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో ఆసుపత్రి వద్ద వైఎస్సార్సీపీ కార్యకర్తలు, చిన్నారుల బంధువులు శుక్రవారం ఆందోళనకు దిగారు. గత వారం రోజులుగా పట్టణంలో మురికి కలిసిన మంచినీరు సరఫరా అవుతోందని, ఈ విషయమై మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదు చేసిన ప్పటికీ చర్యలు తీసుకోలేదని వైఎస్సార్సీపీ నాయకులు తెలిపారు. గత సోమవారం నుంచి పలువురు చిన్నారులు ఆరోగ్య సమస్యతో ఆసుపత్రిలో చేరుతు న్నారని, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కార్తిక్ తెలిపారు. చిన్నారులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, నమూనాలను పరీక్షల కోసం పంపించినట్లు వైద్యులు చెప్పారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న చిన్నారుల పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావును వైసీపీ నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు ముట్టడించి ఆందోళన చేపట్టారు. దానితో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో తాగు నీటి సమస్యపై చర్యలు తీసుకుంటున్నామని, చిన్నారుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరు త్రాగాలని సూచిస్తూ సమస్యపై పట్టణంలో మైక్ ప్రచారం ద్వారా అవగాహన కల్పించానున్నట్టు ఆయన చెప్పారు. కాగా కనీసం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కూడా అందించడంలో కూటమి ప్రభు త్వం విఫలమైందని, ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్ళడం కానీ చేపట్టలేదని వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు మన్యం చంద్ర రావు విమర్శించారు. మంచి నీటి చెరువులో చేపల వేట కారణంగానే త్రాగునీరు కలుషితం అవ్వడం, అదే నీటిని పట్టణ ప్రజలకు అందజేయడం వలనే చిన్నారులు రోగాలకు గురికావడం జరుగుతుందని బాధితులు ఆరోపించారు. దీనికి కారణమైన మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులను సస్పెండ్ చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ నాయకులు పాగా సురేష్ కుమార్, నేతల హరిబాబు, కరణం భాను, లింగం శివప్ర సాద్, ఇరుసుమళ్ళ సాయి, చిట్టిమాని శ్రీనివాస రావు, పెండ్యాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan